Acc. No. 3278

ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం.ఏ., పిహెచ్.డి.

పాలకొండ

ప్రవేశిక

ఇది శ్రీకాకుళమండలములోని ప్రాచీనమైన కొండజమీందారీలలో నొకటి. సర్క్యూటుకమిటీ విచారణకాలమున పాలకొండజమీందారు విజయనగరము జమీందారునకు లోఁబడియుండి యుద్ధసమయములలో సేనలతో తోడ్పడుటయేగాక సాలీనా 52 వేలు కప్పము చెల్లించుచుండెను. ఈ సంస్థానమున 108 జిరాయితీగ్రామములు, 68 మొఖాసాగ్రామములు, 49 అగ్రహారములు నుండినవి. ఇదికూడ తక్కిన కొండజమీందారీలవలె జయపురమునాశ్రయమున రూపొందినట్టి సంస్థానము. ఏ పెద్దగడియలో నీ సంస్థానమవతరించినదోకాని, అవతరించిననాఁటినుండి దీని నరిష్టము లనేకము లావరించి పీడించి అంతరింపఁ జేసినవి. పట్టుమని పదియేండ్లు ఏ పాలకుఁడుగూడ దీనిని పాలింపలేదు. పాలించినను పరిసరరాజన్యులతోడి కలహములు, గృహచ్ఛిద్రములువంటివి అడుగడుగున పాలకొండను పట్టి పాలార్చినవి. రాఁబడి 77 వేలు; పేష్కషు 55 వేలు.

సంస్థాన చరిత్రము

పాలకులు కోదు లేక జాతాపు అను కొండజాతమువారు*. జయపురము రాజాగారగు విశ్వంభరదేవుగారు (1672–1676) ఈ కుటుంబమువారి మూలపురుషుఁడయిన 'దన్నాయి' యనువాని కుమారుని నరేంద్రనాయఁ డను బిరుదముతో పాలకొండ వీరఘట్టములకు జమీందారుని గావించెను. వీరు ధనుర్విద్యలో నేకలవ్యుని మించినవారు.

'....ఒక కోదువిల్కాని కొసఁగెఁ బాల్కొండఁ గృపన
రేంద్రరా వని విశ్వంభరేశ్వరుండు' —ప్రభాసకావ.

తిరుగుబాటుస్వభావముగల నౌకరును లోఁబఱుచుటకు సాయముకోరినప్పుడీ జమీందారులు విజయనగరము పూసపాటివారి యాశ్రయమునఁ జేరుట జరిగినది. అందువలన వీరు కొండజమీందారుల తిరుగుబాటులోఁ జేరలేదు. 1794లో పాలకొండ జమీందారగు విజయరామరాజు మూఁడేండ్లపాటు కుంఫిణీ ప్రభుత్వముపై పితూరీ జరిగించుటవలన అధికారమునుండి ఆయనను తప్పించి

* 'ఏవం స్థితే విజయనగర్యాః పంచయోజనదూరేస్థితస్య పాలకొండనామక కిరాత సామంత రాజ్యస్య....' —శ్రీరామచంద్రకథామృతేతిహాసపీఠిక, పు. ౬.

1796 లో ఆయనకుమారుఁడగు సీతారామరాజుగారికి సంస్థానమునిచ్చివేయుట జరిగినది. సీతారామరాజు 1798 లో కాలముచేసినందున ఆయనసోదరుఁడగు వెంకటపతిరాజుగారికి జమీ సంక్రమించినది. సీతారామరాజు తండ్రియును, పదభ్రష్టుఁడునునగు విజయరామరాజు కొంతసేనను ప్రోవుచేసికొని, తన తిరుగుబాటునకు వీరఘట్టమును కేంద్రముగా నేర్పఱచికొని అరాజకచర్యలను మొదలుపెట్టెను. కుంఫిణీసేనలకు చిక్కక విజయరామరాజు తప్పించుకొని మన్యములలో సంచరించుచు నాగపురము పాఱిపోయెను. ఆ నాఁటికి వెంకటపతిరాజు తొమ్మిదేండ్లవాఁడు. ఎల్లుమహంతి పరశురామపాత్రుఁడు దివానుగా నుండెను. వెంకటపతిరాజుగారితోడనే 1803 లో శాశ్వతపరిష్కారము జరిగినది.

వెంకటపతిరాజు దుబారా మానిసి; విషయలోలుఁడు. పేష్కషు సక్రమముగా చెల్లింపనందున జమీందారీ తఱచుగా జప్తునకు వచ్చుటయు, దివాను జామీనుపలన తిరిగి విడుదలయగుటయు జరుగుచుండినది. రాజునకు, దివానునకు కలఁతలు పుట్టినవి. విశ్వాసపాత్రుఁడైన దివాను జగన్నాథపాత్రుని, దివానుసోదరుని రాజాగారి మొఖాసాదారుఁడు వెంకటరాయఁడు, అతనిమేనల్లుఁడు పాపారాయఁడు సాయుధసేనతోవచ్చి 1828 లో హత్యగావించిరి. క్రుక్కడి రాజునకు మొండిప్రజలు. చపలచిత్తుఁడయిన రాజునకు జమీందారీ మీఁద పట్టు తప్పిపోయినది. తిరుగుబాటులు, దోపిడులు విచ్చలవిడిగ జరుగుచుండినవి. ఇట్లు సంస్థానము వేడిమంగలమువలె వేగుచుండ 1828 అక్టోబరునెలలో వెంకటపతిరాజు మరణించెను.

వెంకటపతిరాజునకు కూర్మరాజునరేంద్రరావు, విజయరామరాజు నరేంద్రరావు, నీలాద్రిరాజు నరేంద్రరావు అని ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, ఎనిమిదిమంది భార్యలు ఉండిరి. ఈ భార్యలలో తాళికట్టినవారు తక్కువ. పెద్దలక్ష్మినరసయ్యమాత్రము ఈతని తాళికట్టినభార్య. పెద్దజగ్గయ్య ఒక వేశ్య. సీతయ్య, చామలయ్య, చిన్నజగ్గయ్య, సుందరయ్య తెలుఁగువారు. వెంకటలక్ష్మయ్య యొక రైతుబిడ్డ. సుభద్రయ్య కమసాలికులమునకుఁ జెందినది. పట్టమహిషికి సంతతిలేదు. పెద్దకుమారుఁడైన కూర్మరాజు వారకాంత యగు పెద్దజగ్గయ్యకుమారుఁడు. రెండవకుమారుఁడగు విజయరామరాజు చిన్న జగ్గయ్యకుమారుఁడు. మూఁడవకుమారుఁడైన నీలాద్రిరాజు వెంకటలక్ష్మయ్యకు పుట్టినవాఁడు.

వెంకటపతిరాజుమరణముతో సంస్థానాధిపత్యమునకు తగాదాలు మొదలైనవి. పెద్దకుమారుఁడగు కూర్మరాజునే కుంఫిణీవారు 1829 లో వారసునిగా గుర్తించి రాజాగారి వితంతుభార్యయగు చామలయ్యను ఎస్టేటుమేనేజరుగా నియమించి సంస్థానపాలనమును కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వశమొనర్చిరి. మైనరు జమీందారగు కూర్మరాజునకును, మేనేజరుగానుండిన చామలయ్యకును సరిపడ

లేదు. తక్కిన తల్లులందఱును జగడగొండులు. వీరు ఎవరికివారే యమునాతీరే బాపతు. వీరికి విడివిడిగా మొఖాసాదారులయు, ముఠాదారులయు మద్దత్తుండినది. ఆ పిమ్మట పద్మనాభాచార్యులను సతనిని గార్డియన్‌గా నియమించిరి. కాని వీరి యంతఃకలహములు పరాకాష్ఠనుబొంది జమీందారీ యంతటను అల్లరులు, అరాజకచర్యలు అధికమైనవి. 1831 లో కూర్మరాజునకు ప్రాజ్ఞతవచ్చుసరికి 93 వేల పేష్కషు పైకము బకాయిపడినది. పేష్కషు చెల్లనందునను, పితూరీలు పెచ్చుపెరిగినందునను 1837 లో కూర్మరాజును జమీనుండి తప్పించి సంస్థానమును 1846 దాఁక కలెక్టరు అజమాయిషీలో నుంచిరి. 1846 నుండియీ జమీందారీని హొంజరం తాలూకాతోపాటు లక్ష పదివేలకు ఆర్బత్‌నాట్ కంపెనీ. కవులున కిచ్చుచువచ్చిరి. మఱి కొంతకాలమునకు ప్రభుత్వవశమునకు వచ్చినది.

తుదకు కుంఫిణీవారు పాలకొండ జమీందారు కుటుంబమునకి పరివారములోని ముఖ్యులను మొత్తము 19 మందిని చెఱపట్టి ఉత్తరార్కాడు మండలమందలి రాయవేలూరు దుర్గమున నిర్బంధములో నుంచిరి. కూర్మ రాజునకు మొదట మరణశిక్షనువిధించిరి కాని, యాపిమ్మట యావజ్జీవ కారాగారవాసశిక్షగా స్థిరపఱిచి యతనిని, ఆతని తల్లి పెద్దజగ్గయ్యను గుత్తి కోటలోను, విజయరామరాజు మొదలైన తక్కినవారిని రాయవేలూరు కోటలోను నివసించునట్లు గట్టి కట్టడచేసిరి. 1843 లో కూర్మరాజు గుత్తిదుర్గమునందే మరణించెను. 1844 లో నీలాద్రిరాజు రాయవేలూరులో మరణించెను. 1869 లో మద్రాసుగవర్నరు నేపియర్ ప్రభువు రాయవేలూరును దర్శించినపుడు పాలకొండ పాలక కుటుంబమును పరామర్శించి విజయరామరాజు రాయవేలూరుకోటలో నిర్బంధమున నుండనక్కఱలేదనియు, కృష్ణానదికి దక్షిణమున నెచ్చటనైనను నిచ్చవచ్చినట్లు సంచరింపవచ్చుననియు ఉత్తర్వులు దయ సేయించెను. కాని విజయరామరాజు నూటికో కోటికో చెన్నపట్టణమునకుఁదప్ప మఱియెచ్చటకును బోలేదు. అతని సవతితల్లి సుభద్రయ్య, సవతిచెల్లెలు చంద్రయ్యమ్మ కూడ అతనితో నుండిరి. విజయరామరాజు నెల భరణము రూ. 17 న్నర నుండి రూ. 250 లకు పెంచిరి*. పాలకొండ జమీందారీ కుటుంబము ఇరువదియవ శతాబ్దము వెలుగును చూడనే లేదు. రాయవేలూరు కోటయందే వీరి వంశమంతరించినది.

సాహిత్యపోషణము

పదునెనిమిదవ శతాబ్దిలో పాలకొండను పాలించిన రామభద్ర రాజు సాహిత్యపోషకుఁడు. పురిజాల లక్ష్మీనారాయణ దాస కవి రచించిన పారిజాత మను యక్షగానకృతి రామభద్రరాజునకుఁ గృతి యీఁబడినది. కవి కాశ్యప

*M.A.M.P., Vol. I, Political Pensioners, p. 4.

గోత్రుఁడు, పాపయరాజామాత్య పౌత్రుఁడు, అనంతమాంబానాగయామాత్యుల పుత్రుఁడు, తిరుమల తాతాచార్యుల శిష్యుఁడు, వేంకటేశ్వరవరప్రసాదలబ్ధ కవితావైభవుఁడగు నీ కవి—

'పాలకొండాన్వయుఁడు రామభద్రనృపతి
నన్నుఁదగి నట్టి సంభావనలను దనిపి
కృష్ణునకుఁబారిజాత మంకితమొసర్చి
చెప్పుమన యక్షగాన మేఁజేసి తిట్లు'

అని కృత్యవతరణికలో నేతద్గ్రంథావతరణగాథను వివరించినాఁడు. క్రీ.శ. రామభద్ర నృపతి ప్రేరణమున రచితమైన యీకృతి అముద్రితము. ప్రాచ్య లిఖితపుస్తకభాండాగారమున దీని తాళపత్రప్రతి ఆర్. నం. 438 గా నున్నది. ఇందన్యదేశ్యములు కొల్లలుగా నుపయుక్తము లయియున్నవి.

అడిదము సూరకవి చాటువులలో ఈ రామభద్రనృపతి బహువారములు పేర్కొనఁ బడినాఁడు. సూరకవి చాటువులు కొన్ని. సస్యశ్యామలమగు పాలకొండ సీమను గుఱించి సూరకవి చెప్పిన పద్యమిది :

క్షేమాకర్ణ వికీర్ణ ధామములు నక్షీణేక్షురంభాటవీ
స్తోమంబుల్ బహుశాలిధాన్యతతు లెచ్చోటన్ నదీమాతృక
గ్రామంబుల్ బహుశాగ్రహారము లనేకంబులు ధరన్ జూడఁగా
క్షామంబన్నది లేదు క్షీరగిరిదేశంబందు నెందేనియున్'

—చాటుపద్యమణిమంజరి, పు. 40.

'....మన్నె దేశముల్ దిరిగి సమస్త వస్తువులు దెచ్చి భుజించు' చుండిన అడిదము సూరకవి అడుగుపెట్టని మన్నె దేశ మానాఁడులేదు. సూరకవి పాలకొండ ప్రభువు రామభద్రనృపుని గుఱించిచెప్పిన చాటువులు మఱికొన్ని చూడుఁడు :

'రాజా జారుఁడు, మంత్రి నిర్దయుఁడు, నీ రాష్ట్రింబులోఁబెద్దలా
కోజుల్ కొండలు, జీవహింసకును సంకోచింప, రెవ్వారికిన్
దాజీ మీయరు పాలకొండపురిలో దాక్షిణ్య శూన్యత్వ మీ
ఫాజీ పట్టణమేల వచ్చితిని నా పాపంబు సర్వేశ్వరా'

—పైది, పుటలు 39, 40.

ఇఁక పాలకొండ పాలకుని పరివారమును గుఱించి చెప్పినపద్యము :

'నరసింగుండును వెంకుపాత్రుఁడును గృష్ణాపాత్రుఁడున్ నాయుఁడున్
శరభాపాత్రుఁడు పాలకొండ ధరణీ సామ్రాజ్యధౌరేయులై
ధర వర్ధిల్లెడు రామభద్రనృపు నాస్థానంబునం బంచముల్
చిరకాలంబుగ వీరి వెంటఁ దిరుగన్ జీ చీ మనంబొప్పునే'

—పైది, పు. 40.

ఇట్లు నిర్భయముగా రాజులను, రాజపరివారమును చెడఁదిట్టిన కవులు చాలతక్కువ.

పాలకొండ జమీందారుగారు సుప్రసిద్ధపండితకుటుంబమగు నడిమింటి వారికి 'కందిశ' యను నగ్రహారమును దయచేయించియుండిరి. కురుపాం సంస్థానాధీశ్వరుల కోరికమీఁద నడిమింటివారి కుటుంబము కోనసీమనుండి నాగావళీతీరమునకు వచ్చియుండినది. నాఁటి కొండజమీందారు లనేకులు ఈ కుటుంబమువారి ప్రతిభాపాండిత్యములకు భరపడియో, వారికిఁగల శాపానుగ్రహాదిశక్తులకు భయపడియో అనేకాగ్రహారములను సమర్పించియుండిరి. నడిమింటి పేరుచయనులుగారు తర్కపండితులు. వీరి కుమారులు సర్వమంగళేశ్వరశాస్త్రిగారు ఆసేతుశీతనగము ప్రసిద్ధివహించిన మహాపండితులు. సర్వమంగళేశ్వరశాస్త్రిగారి పుత్రులు భగవత్పతంజలిశాస్త్రిగారు నేపాలు మహారాజాస్థానమునందు మన్ననలను బడసిన మహామనీషి.

సర్వమంగళేశ్వరశాస్త్రిగారి చాటువులలో పాలకొండ జమీందారీకి సంబంధించినవికూడ కలవు. ఉదాహరణమున కొకచాటువు :

'రుక్కయ్యాత్కయ్యమాపాద్య భయం కమలనాభయేత్
రంగయ్యాచ్చ గయామేతి న సీతారామభూపతి.'

రుక్కయ్య, కమలనాభయ్య, రంగయ్య అను ముగ్గురును పాలకొండ జమీందారు సీతారామరాజుగారియొద్ద దివానులుగనుండిరి. వీరు తెచ్చిపెట్టిన అనావశ్యక కలహముల మూలమున రస్సెల్ దొరగారు ఏపాపమెఱుఁగని జమీందారుగారిని పితూరీదారునిగా ఖైదుచేసి జమీందారీని వశపఱచికొనుట జరిగినది.

పాలకొండ జమీందారులు నిర్మించిన కూర్మరాజపురాగ్రహారమునందలి విష్ణ్వాలయమునందు ద్రావిడ వేదప్రవచనపరులైన శ్రీ వైష్ణవ పండితులనేకులుండిరి. విద్వత్కవి ముడుంబ నరసింహాచార్యస్వామి (1841–1927) వారి పితామహులగు రాఘవాచార్యులకు పాలకొండ జమీందారులు గృహభూదానము లొసఁగి సత్కరించియుండిరి*.

పాలకొండ దివానుల కుదురునకుచెందిన ఎల్లుమహంతి భద్రయ్య పాత్రులుగారి కనిష్ఠపుత్రులు ఆదినారాయణపాత్ర విరచితమగు శ్రీ వరాహుని చరిత్రమను కృతి యొకటి కన్పట్టుచున్నది. కర్త ఆంధ్రగీర్వాణాంగ్లేయ భాషా పరిజ్ఞాత. కృతి పంచమ జార్జి చక్రవర్తి ఢిల్లీ పట్టాభిషేకముహూర్తమున (12–12–1911) పట్టాభిషేకస్మృతిచిహ్నముగాఁ బ్రచురితము. శ్రీమన్నారాయణుని భక్తుఁడగు వరాహుఁడను వాని కల్పితకథ యిందలి యితివృత్తము.

*మేదేపల్లి వేంకటరమణాచార్యులు, విద్వత్కవి ముడుంబ నరసింహాచార్యస్వామి వారి చరిత్రము, భారతి, 1930, ఏప్రిల్, పుటలు 641–650 ; శ్రీరామచంద్ర కథామృతేతి హాస పీఠిక, పు. 5.

పూర్వకవి కృతపద్యములిందు యథాసందర్భములం దుదాహరింపఁబడినవి. హరికథా కాలక్షేపమున కనువుగా పాటలతో, పద్యములతోఁ గూర్పఁబడినది.

ఉపజీవ్య గ్రంథసూచి

1. విశాఖపట్టణము జిల్లా వృత్తాంతసంగ్రహము, పుటలు [illegible]; 565—570.

2. నిడుదవోలు వేంకటరావు, ఆంధ్రసంస్థానములు — సాహిత్యసేవ, తెలుగు విజ్ఞానసర్వస్వము 3, పుటలు 1171—1175.

3. కవికొండల వేంకటసత్యనారాయణమూర్తి, విశాఖమండలచరిత్రము, కాకినాడ ముద్రాక్షరశాల, కాకినాడ, 1927, పుటలు 171—176.

4. అడిదము సూరకవి చాటువులు.

5. M. A. M. P. Vol. I.